క్లుప్తంగా

మెగా డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

చిలకలపూడి(మచిలీపట్నం): మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ కోసం సంబంధిత అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి జి.రమేష్ శనివారం తెలిపారు. జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థులు టెట్ పరీక్షల్లో అర్హత పొంది ఉండాలన్నారు. జిల్లాలో 200 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. అయితే ఈ శిక్షణ కోసం కేవలం 44 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని, ఎక్కువ మంది అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. ఇందుకోసం సంబంధిత అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 90141 30833 నంబరులో సంప్రదించాలన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సేఫ్టీ కిట్ల పంపిణీ



చల్లపల్లి: చెత్త నుంచి సంపదను సృష్టించే కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థాలను వేరు చేసే గ్రీన్ అంబాసిడర్లకు శనివారం సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. మండల పరిధిలోని పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నుంచి 42 కిట్లను చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 18 మంది గ్రీన్ అంబాసిడర్లకు కేటాయించారు. వాటిలో కొన్నింటిని ఇన్చార్జి ఎంపీడీవో వి.రవిశంకర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, ఏపీఎం కె.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాదరావు, ఏఎస్‌ఎంలు, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలి



అవనిగడ్డ: డీఎస్సీలో పీఈటీల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఏపీ వ్యాయామ విద్య పోరాట సమితి నాయకుడు దేవేంద్రగౌడ్ చెల్లయ్య (జమ్మల్) డిమాండ్ చేశారు. శనివారం ఆయన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఫిజికల్ ఈవెంట్స్ స్పోర్ట్స్ మెరిట్ సర్టిఫికెట్స్‌కు వెయిటేజ్ మార్కులు తీసేయడం వల్ల క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న పీఈటీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కొంతమంది కాలేజీలకు కూడా వెళ్లకుండా పీఈటీ సర్టిఫికెట్స్ తెచ్చుకున్నవారు ఉన్నారని, జీవో నంబర్ 11 వల్ల నిజమైన పీఈటీలు తీవ్రంగా నష్టపోతారన్నారన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం లేనివారిని ఎంపిక చేయడం వల్ల భవిష్యత్‌లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల రక్షణకు చట్టాలు కావాలి



బంటుమిల్లి: వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ కూలీల రక్షణకు ప్రభుత్వాలు చట్టాలు తెచ్చి ఆదుకోవాలని వ్యవసాయ రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా మండల పరిధిలోని పెందుర్రు గ్రామంలో పర్యటించారు. నాయకులు మాట్లాడుతూ ఉపాధీ కూలీలకు పని దినాలు, వేతనం పెంచేందుకు సంఘం కృషి చేస్తున్నదని అన్నారు. వ్యవసాయ కూలీలకు చట్టాలు లేకపోవడంతో వారికి ఎటువంటి రక్షణ లేదన్నారు. మే 5వ తేదీన నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని కూలీలు విజయవంతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు ఎల్.అజయ్‌ఘోష్, సీపీఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, శ్యాము, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



దేవరకోట(ఘంటసాల): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యం, ఆదాయం వస్తాయని సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని దేవరకోట పంచాయతీ వద్ద ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్- 2025 గ్రామ సభ శనివారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి చావల కాంతారావు, వీఏఏ బండి సత్యదేవ్ మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కరువాయే.. పాడి పోషణ భారమాయే..

- పసిరి మేత కూడా దొరకని వైనం
- పాల దిగుబడిపై ప్రభావం
- పాడి రైతులకు ప్రభుత్వం నుంచి దక్కని ఆసరా



మేతకోసం అలమటిస్తున్న పశువులు



మేత లేకపోవడంతో దూరప్రాంతాలకు పయనం

కృత్తివెన్ను: పాడిపంటలతో అలరారే పల్లెసీమలు నేడు పంటలేక.. పాడిలేక అల్లాడిపోతున్నాయి. వరుస పంటల విరామం కారణంగా పశుగ్రాసం కరువై ఆ ప్రభావం ఇప్పుడు పాడి పరిశ్రమను కుదేలు చేస్తోంది. మండల వ్యాప్తంగా ఇప్పుడు పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. దీంతో రాబోవు రోజుల్లో పాలు దొరకడం కష్టం కానుంది. గతంతో పోల్చుకుంటే పాలదిగుబడి ఇప్పుడు సగానికి పడిపోయిందని పాడిరైతులు వాపోతున్నారు. దీనికి ప్రధాన కారణం పశుగ్రాసం లేకపోవడమే. మండల వ్యాప్తంగా దాదాపు 10,500 పశువులు, 5,400 ఆవులు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ గణాంకాలు చెబుతున్నాయి. రోజుకు సగటున సుమారు 4 నుంచి 6 వేల లీటర్లు పాల దిగుబడి ఉంటుంది. వీటిలో కొన్ని గ్రామాల్లో విజయ డెయిరీ పాలను సేకరిస్తోంది. దీంతో పాటు కొన్ని ప్రైవేటు డెయిరీలు సైతం గ్రామాల నుంచి పాలను సేకరిస్తున్నాయి.

కరువైన పశుగ్రాసం..

ఈ ఏడాది దాళ్వాపై ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే ఎదురయింది. దీంతో గ్రామాల్లో ఎండుగడ్డి నిల్వలు తరిగిపోయాయి. వీటితో పాటు పంట చేలల్లో గతంలో ఉండే పచ్చగడ్డి ఇప్పుడు మచ్చుకైనా కానరావడం లేదు. చేసేదిలేక రైతులు తమ పశువులను మేపేందుకు ఎండుగడ్డి లేక పచ్చగడ్డి రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు లేని కారణంగా పచ్చగడ్డి పూర్తిగా కనుమరుగైపోయిందని దీంతో ఉత్పత్తి సగానికి పైగా తగ్గిపోయినట్లు రైతులు వాపోతున్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు..

పాల దిగుబడి పడిపోవడానికి ఇటీవల పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా మరో కారణంగా కనిపిస్తోంది. ఇటీవల పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు పసిరి మేత లేని కారణంగా పశువుల్లో పాలశాతం తగ్గిపోతున్నట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు. పంట చేలల్లో ఎక్కడ చూసినా పచ్చని పరక లేకపోవడం, ఎండల తీవ్రత పాడి రంగంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుందని పాడిపరిశ్రమపై ఆధారపడే రైతులు వాపోతున్నారు.

సగానికి పడిపోయిన పాల దిగుబడి..

గతంలో రోజుకు దాదాపు ఆరువేల లీటర్లు వరకు ఉన్న పాలదిగుబడి నేడు రెండు నుంచి మూడు వేల లీటర్లకు పడిపోయినట్లు తెలుస్తోంది. పైగా పశుగ్రాసం కొరత కారణంగా చాలా మంది రైతులు తమ పశువులను విక్రయించేస్తున్నారు. ఈ లెక్కన చూసుకుంటే రాబోయే రోజుల్లో గ్రామాల నుంచి పాల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోతుందనే ఆందోళన సామాన్య ప్రజలను సైతం కలవర పెడుతోంది. పశుగ్రాసం లేకపోవడం పశుదాణాల ధరలు పెరిగిపోవడం తదితర అంశాలు మరింత దిగజారుస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడి పరిశ్రమ ప్రోత్సాహం విషయంలో ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తోందని పాడి రైతాంగాన్ని ఆదుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎక్కడ చూద్దామన్నా పచ్చని పరక కనిపించడం లేదు. దీంతో నాలుగు లీటర్ల పాలిచ్చే పశువు సైతం రెండు లీటర్ల పాలు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. పంటల విరామంతో ఎండుగడ్డి నిల్వలు లేవు. ఈ రోజుల్లో వేలాది రూపాయలు వెచ్చించినా ఎండుగడ్డి దొరకని పరిస్థితి ఉంది. ఇదే కొనసాగితే పశువులను మేపడం కష్టమే. దాణాలను సబ్సిడీపై అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

జి.పెద్దిరాజులు, పాడిరైతు

పొలాల్లో పచ్చగడ్డి లేదు



ఎండల తీవ్రత కారణంగా పాలు ఉండటం లేదు ప్రస్తుతం విపరీతంగా ఎండలు వేస్తున్నాయి. పొలాల్లో పచ్చగడ్డి లేదు. దీంతో గేదెలు వద్ద పాలు సగానికి సగం తగ్గిపోయాయి. ఎన్ని గంటలు పొలాల వెంబడి తిరిగినా పశువులకు పచ్చని మేత దొరకడం లేదు. దీంతో పాలదిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది.

పి. నరసింహారావు, రైతు

బాధిత కుటుంబాలకు పేర్ని కిట్టు పరామర్శ



భవానీని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)

వాడపాలెం, మాలకాయలంక (మచిలీపట్నంరూరల్): ఇటీవల కొద్దిరోజుల క్రితం గుండె జబ్బుతో మరణించిన బాధిత కుటుంబాలను శనివారం మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పరామర్శించారు. మండల పరిధి వాడపాలెం పంచాయతీ, వెంకట దుర్గమాంబ గ్రామం, కేపీటీ పంచాయితీ పరిధిలోని మాల కాయలంక గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీకి చెందిన కొక్కిలిగడ్డ స్వామి (39), నాగి వెంకటనారాయణ (42) ఇటీవల గుండె నొప్పితో మరణించగా వారి కుటుంబాలను కిట్టు పరామర్శించారు. కొక్కిలిగడ్డ స్వామి మేనమామ అయిన గ్రామ పార్టీ ఇన్‌చార్జి గురువు వసంతరావు (గురువు)ను కలిసి పరామర్శించి మాట్లాడారు. అనంతరం వెంకటనారాయణ నివాసానికి వెళ్లి ఆయన భార్య భవానీని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఘనసేన రమేష్, మచిలీపట్నం సౌత్ అధ్యక్షుడు జొన్న రాఘవరావు, మాజీ కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ బాలయేసు, జంపాన్ని సుబ్రహ్మణ్యం, వాడపాలెం సర్పంచ్ మేడిశెట్టి రాజకుమార్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న యువతకు ఆదర్శం



గౌతు లచ్చన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు



అవనిగడ్డలో గౌతు లచ్చన్న చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులు



దేవరకోట గౌడపాలెంలో లచ్చన్న చిత్రపటానికి నివాళి



కోడూరులో లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘు నాయకులు



పెడనలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

మచిలీపట్నంటౌన్: స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి ఆ సంఘ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేసిన సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రతి బీసీ బిడ్డ భవిష్యత్తు బాగుండే విధంగా కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ పనిచేస్తుందన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతి బీసీ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు రాజ్యలక్ష్మి, రాగి చంద్రశేఖర్, కే వెంకట్రావు, షేక్ జానీ, ముంతాజ్, ప్రసాద్, శేషు, రాము, ఎం భాస్కర్ తదితర బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న ఆశయాలు ఆదర్శనీయం

అవనిగడ్డ: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చెప్పారు. స్థానిక కార్యాలయంలో శనివారం గౌతులచ్చన్న వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమిందారీ వ్యవస్థ, ఇనామీ వ్యవస్థ రద్దు చేయాలని కోరుతూ 2,400 కి.మీ ఆయన పాదయాత్ర చేశారని చెప్పారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గౌతు లచ్చన్న విగ్రహానికి ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు నాయకులతో కలిసి శనివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ సంఘ నాయకులు కొనకళ్ళ బుల్లయ్య, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రాము, బండి రామకృష్ణ, గడ్డం రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, హసీం బేగ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, గౌతు లచ్చన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

లచ్చన్న ఆశయాలతో ముందుకు సాగాలి

దేవరకోట(ఘంటసాల): మండలంలోని దేవరకోట గౌడపాలెంలో స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి దివంగత సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని శనివారం నిర్వహించారు. పరిశే వినయ్ బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులు దోనేపూడి ఓంకార్, యువజన సంఘ సభ్యులు బోలెం రవి, బోలెం వాసు, పరిశే రాధా బాబు, పరిశే రాకేష్, స్థానికులు పాల్గొన్నారు.

పెడన: పట్టణ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని శనివారం నిర్వహించారు. అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. అఖిలపక్ష నాయకులు బెజవాడ నాగరాజు, కట్టా హేమసుందరరావు, యక్కల శ్యామలయ్య, చోడవరపు అప్పారావు, వీరంకి నరసింహారావు, పత్తిపాటి జయకృష్ణ, మామిడి నరసింహగుప్త, లచ్చన్న అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోడూరు: సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని బీసీ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో లచ్చన్న చిత్రపటానికి సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లచ్చన్న సేవలను గుర్తు చేసి జోహార్లు అర్పించారు. సంఘం మండలాధ్యక్షుడు కొండవీటి సురేష్, నేతలు అద్దంకి పాండురంగారావు, అద్దంకి కృష్ణ, తెలప్రోలు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వ్యర్థాలతో తీవ్ర ముప్పు



వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థుల స్వచ్ఛ ఆంధ్ర



నందమూరు సచివాలయం వద్ద ఎలక్ట్రానిక్ పరికరాలు అప్పగిస్తున్న కాలేజీ సిబ్బంది



మోపిదేవి దేవస్థానంలో ప్రతిజ్ఞ..

రుద్రవరం(మచిలీపట్నంరూరల్): విద్యుత్ వ్యర్థాలతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని కృష్ణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డీన్ వైకే సుందరకృష్ణ అన్నారు. మండల పరిధి రుద్రవరంలోని కృష్ణ యూనివర్సిటీలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా డీన్ సుందరకృష్ణ మాట్లాడుతూ విద్యుత్తుతో పనిచేసే ఎలాంటి పరికరమైనా అది పాడైనప్పుడు దాన్ని ధ్వంసం చేసే విషయంలో కూడా బాధ్యతాయుతంగా ధ్వంసం చేయాలన్నారు. విద్యార్థులు, యువత ముందుకు వచ్చి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని విద్యార్థులను కోరారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రా సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి, పలువురు సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

పెడన: మండల పరిధిలోని నందమూరు వాసవి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కాలేజీలో పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రం వద్ద అప్పగించారు. కాలేజీ కరస్పాండెంట్ కేకుమార్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టరు బీఆర్‌ఎస్ రెడ్డి, ఈడీ బాబాలు అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు.

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నా పరిశరాల పరిశుభ్రతకు ప్రతి రోజూ కొంత సమయం కేటాయించి, పరిసరాల పరిశుభ్రత సాధించేందుకు కట్టుబడి ఉంటానని డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం దేవస్థానం ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

గూడూరు: పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులు పర్యావరణానికి ఎంతో హానికరమని ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కలెక్షన్ కౌంటర్‌పై అవగాహన కల్పిస్తూ సర్పంచి లింగం సులోచనారాణి ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.వనజ, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ బి.రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి టి.వి.వి.భాస్కరరావు, లింగం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకూ పంచాయతీ అధికారులు, సచివాలయ స్బిబంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, గ్రీన్ అంబాసిడర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో వి.రవి శంకర్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించేందుకు ప్రధాన సెంటర్లో ఈ-వేస్ట్ కలెక్షన్ బాక్సును ఏర్పాటు చేశారు. ఏపీఎం కె.శ్రీనివాసరావు, కార్యాదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని గోసంఘం ప్రాంతంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహ సముదాయాల ఆవరణలో కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు మొక్కలు నాటారు. లబ్ధిదారులతో కలిసి ర్యాలీ చేశారు. టిడ్కో ప్రాజెక్టు డైరెక్టర్ బి.చిన్నోడు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, గో సంఘం వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని కమిషనర్ బాపిరాజు ప్రారంభించారు. క్యాటిల్ డిపో నుంచి కోనేరుసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పలు శాఖల కార్యాలయాల ఆవరణలను అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు.

కృత్తివెన్ను: గ్రామాలలో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని సచివాలయాల పరిధిలో ప్రతిజ్ఞలు, ర్యాలీలు, చెత్తసేకరణ కార్యక్రమాలు జరిపారు. పల్లెపాలెం పాఠశాలలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా సెమినార్ నిర్వహించారు. ఎంపీడీఓ శైలజకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిట్టూర్పు(ఘంటసాల): మండలం చిట్టూర్పులో పంచాయతీ కార్యదర్శి నెమలకంటి శ్రీలక్ష్మి కృష్ణవేణి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీపీ స్కూల్లో మానవహారం నిర్వహించి విద్యార్థులతో హెచ్‌ఎం వెంకటేశ్వరమ్మ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. చిట్టూర్పు ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం బండారు వెంకటేశ్వరమ్మ, వీఏఓలు రజిని, శివనాగలక్ష్మీ, సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

నీడ కొండంత.. పూలతో పులకింత





చల్లపల్లి- మచిలీపట్నం ప్రధాన రహదారి రామానగరంలో కొండచింత చెట్టు కనువిందు చేస్తోంది. పెల్టోఫోరమ్ టెరోకార్పమ్ శాస్త్రీయ నామం గల ఈ చెట్టును తెలుగులో పచ్చ సుంకేసుల లేదా కొండ చింత అని పిలుస్తారు. ఈ చెట్టుకు ప్రతి వేసవిలో పసుపు వర్ణం పూలను గుత్తులు గుత్తులుగా కాస్తాయి. పచ్చని ఆకులపై పసుపు రంగు పూలు కంటికి ఇంపుగా.. ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. ఈ చెట్టుకింద కాసేపు సేదతీరి పూల అందాలను చూడాలనిపిస్తుంది ఎవరికైనా.

- చల్లపల్లి

కేటీఎం క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సీనియర్స్



విజేతలకు కేటీఎం ట్రోఫీని అందజేస్తున్న వెంకట రమణమ్మ, హనుమంతరావు

గూడూరు: తరకటూరులో జరుగుతున్న కేటీఎం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కేటీఎం సీనియర్స్ జట్టు నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కేటీఎం జూనియర్స్ జట్టుతో తలపడిన కేటీఎం సీనియర్స్ జట్టు 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ట్రోఫీతో పాటుగా రూ.15 వేల ప్రైజ్ మనీ కైవసం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన కేటీఎం జూనియర్స్ జట్టుకు రన్నరప్ ట్రోఫీతో పాటు రూ.10 వేల ప్రైజ్ మనీ, తృతీయ స్థానంలో నిలిచిన గూడూరు జట్టు రూ.5 వేల ప్రైజ్ మనీ సొంతం చేసుకున్నాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో తరకటూరు, కంచాకోడూరు సర్పంచులు చిన్నం వెంకట రమణమ్మ, కోళ్ల హనుమంతరావు, తరకటూరు సీటి సంఘం అధ్యక్షుడు యర్రపోతు అయ్యప్పలు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గత 13 రోజులుగా సాగిన పోటీలలో మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 జట్లు పాల్గొనడం విశేషం.

భూసార పరీక్షలు తప్పనిసరి

పమిడిముక్కల: రైతులు తప్పనిసరిగా భూసారపరీక్షలు చేయించుకోవాలని ఏఓ గణేష్‌రెడ్డి అన్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం గ్రామ వ్యవసాయ సహాయకులకు మట్టి నమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలంలో మట్టి నమూనా తీయించి అవగాహన కల్పించారు.